క్లుప్తంగా

నేడు మెదక్‌లో 'అలయ్ బలయ్'



మాట్లాడుతున్న రజక సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో ఆదివారం జరిగే 'అలయ్ బలయ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రజక సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సమన్వయకర్త మామిడి సిద్దరాంలు, మండల గౌరవాధ్యక్షుడు చాకలి చిన్న నారాయణ, అధ్యక్షుడు పోచయ్య మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో ఉన్న కుల సంఘం ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

వృథాగా పారుతున్న నీరు



వృథాగా పోతున్న నీరు

నర్సాపూర్: మండలంలో పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పారుతోంది. పట్టణంలోని చౌరస్తా సమీపంలో మెయిన్‌రోడ్డు పక్క నుంచి ఉన్న నీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నీరు వృథాగా పారుతుంది. కావున సంబంధిత అధికారులు లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత నిధులతో బోరు మోటారు ఏర్పాటు



బోరు వద్ద కాలనీవాసులతో దావూద్

నర్సాపూర్: మున్సిపాలిటీలోని మూడో వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దావూద్ తమ వార్డులో నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా సొంత నిధులతో వార్డు పరిధిలో బోరు డ్రిల్లింగ్ వేయించారు. ఈ మేరకు శనివారం మోటారు బిగించి నీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే బోరు వేయించడంతో కాలనీలో నీటి సమస్య తగ్గిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు



జీపీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కోతుల దాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. చిన్నారులు ఆరుబయట ఆడుకుంటుండగా.. కోతులు చిన్నారి కృతికపై దాడి చేశాయి. వెంటనే స్థానికులు కోతుల మందను తరిమేశారు. అయితే కోతుల దాడిలో చిన్నారి కృతికకు కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, గ్రామంలో కోతులను నివారించడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యదర్శి రమాదేవితో వాగ్వాదానికి దిగారు. నివాసగృహాలకు సమీపంలో ఉన్న ప్రకృతివనంలో కోతుల బెడత ఎక్కువైందని వాపోయారు. కోతులతో నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

దుర్గామాత లడ్డూ.. రూ.1.21 లక్షలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి లడ్డూను వేలం పాటలో రూ.1,21 లక్షలకు ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యుడు ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను సన్మానించారు. అనంతరం నవరాత్రులు పూజలు అందుకున్న లడ్డూను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

తుల్జాపూర్‌కు పాదయాత్ర

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు పాదయాత్రగా బయలుదేరారు. మండలంలోని మల్గి, న్యాల్‌కల్, అత్నూర్, డప్పూర్, రుక్మాపూర్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించి.. అనంతరం తుల్జాపూర్‌కు తరలివెళ్లారు. ఐదు రోజుల పాటు పాదయాత్ర తర్వాత భవానీమాతను దర్శించుకుంటారు.

గుడ్డుకు గడ్డు కాలం !

- 9 నెలలుగా అందని బిల్లులు
- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తప్పని తిప్పలు
- ఒక్కో నిర్వాహకుడికి రూ. లక్షల్లో బకాయిలు



చిన్నశంకరంపేటలో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంట నిర్వాహకులు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తుంది. ఈ పథకంలో భాగంగా మధ్యాహ్నం అందించే భోజనంలో వారంలో మూడుసార్లు గుడ్డు అందిస్తున్నారు. అయితే గత 9 నెలలుగా గుడ్డు బిల్లులు చెల్లించక పోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. మెదక్ జిల్లాలో ఒక్కో పాఠశాలలో సుమారు 100 నుంచి 450 వరకు విద్యార్థులున్నారు. అయితే పాఠశాలలో కేవలం గుడ్డు కోసమే రూ.లక్షల్లో ఖర్చు చేశామని, ఉపవాసం ఉంచలేక పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామని మధ్యాహ్న భోజన నిర్వాహకులు చెబుతున్నారు. ఈ మధ్యాహ్న భోజనం బిల్లులు సకాలంలో అందించకపోవడంతో లక్షల్లో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంట నిర్వాహకులకే రూ.2,72,808 అప్పు

చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 421 మంది విద్యార్థులు ఉన్నారు. పౌష్టికాహారంలో భాగంగా ఒక్క రోజు గుడ్ల కోసం రూ.2,526 ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో నెలలో 12 సార్లు గుడ్లు అందించేందుకు రూ.30,312 వెచ్చించారు. 9 నెలలు గడిచినా ఇప్పటికీ గుడ్ల బిల్లులు అందకపోవడంతో అప్పులపాలవుతున్నామని వాపోతున్నారు. కేవలం గుడ్ల కోసమే ఇప్పటి వరకు రూ.2,72,808 అప్పు ఉందని చెబుతున్నారు. దీంతో పాటు మూడు నెలల వేతనాలు రూ 3 వేల చొప్పున, రెండు నెలలుగా వంట నిర్వహణ బిల్లులు బకాయి ఉందన్నారు. కాగా, మండలంలోని 53 పాఠశాలలో 4,392 మంది విద్యార్థులు ఉండగా.. నెలలో 12 సార్లు ఎగ్స్ అందించడంతో రూ.లక్షల్లో బకాయిపడ్డారు.

పెండింగ్‌లోనే..

మెదక్ జిల్లాలో 146 జెడ్పీ పాఠశాలలు, 142 ప్రాథమిక పాఠశాలలు, 7 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఇందులో సుమారు 60 వేల మంది విద్యార్థులుండగా.. ఒక్కో విద్యార్థికి వారంలో మూడు రోజుల చొప్పున నెలకు 12 గుడ్లు అందించాలి. అయితే మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఒక్క రోజు గుడ్లు అందించేందుకు రూ.3.60 వేలు చెల్లిస్తుండగా.. నెలలో 12 సార్లు గుడ్లు అందించేందుకు రూ. 43 లక్షల 20 వేలు వెచ్చిస్తున్నారు. ఇప్పటి వరకు మెదక్ జిల్లాలోని పాఠశాలలకు బకాయి పడిన డబ్బులు కోట్లలో ఉన్నాయి. మరో వైపు మూడు నెలలుగా వేతనాలు, మరో మూడు నెలల వంట నిర్వహణ బిల్లులు పెండింగ్ ఉన్నాయని వంట నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సకాలంలో పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



వంట నిర్వాహకురాలు కవిత, చిన్నశంకరంపేట

అధికారులు స్పందించాలి

మధ్యాహ్న భోజనం కోసం ఖర్చు చేస్తున్న బిల్లులు వెంటనే అందించాలి. నెలకు ఒక్క గుడ్ల కోసమే రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నాం. మూడు నెలలుగా వేతనం కూడ రాలేదు. ప్రభుత్వం వెంటనే బిల్లులు అందించేలా చర్యలు చేపట్టాలి. తమ పాఠశాలలో అధిక సంఖ్యలో విద్యార్థులున్నారు. సరుకులు, గుడ్లు తీసుకొచ్చేందుకు అప్పు చేయాల్సిందే. అధికారులు వెంటనే స్పందించి బిల్లులు అందించేందుకు చర్యలు చేపట్టాలి.

– విజయ, వంట నిర్వాహకురాలు, చిన్నశంకరంపేట

పెండింగ్.. వాస్తవమే

చిన్నశంకరంపేట మండలంలోని పాఠశాలలకు 9 నెలల ఎగ్స్ బిల్లులు పెండింగ్ ఉందనే విషయం వాస్తవమే. వంట నిర్వాహకులకు సంబంధించిన బిల్లులు చేసి అధికారులకు పంపించాం. బిల్లుల మంజూరు గురించి ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– పుష్పవేణి, ఎంఈఓ

అర్బన్‌పార్కులో వలంటీర్ల పర్యటన



అర్బన్ పార్కులో పర్యటించిన వలంటీర్లు

నర్సాపూర్: మండల కేంద్రంలోని అటవీశాఖకు చెందిన అర్బన్‌పార్కులో శనివారం వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్–ఇండియా సంస్థకు చెందిన వలంటీర్లు పర్యటించారు. ప్రస్తుతం సీతాకోకచిలుకల నెలను పురస్కరించుకుని అర్బన్‌పార్కులో పర్యటించారని స్థానిక ఎఫ్ఆర్ఓ అరవింద్ చెప్పారు. వలంటీర్ల పర్యటనను చిత్ర అగ్రికల్చర్ సైంటిస్ట్ ఎస్ఎం అక్బర్ షరీఫ్ సమన్వయం చేశారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా వలంటీర్లు పార్కులో ట్రయల్ ట్రెక్ కార్యక్రమం నిర్వహించారు. కాగా, కొత్త జాతుల సీతాకోకచిలుకలు, పురుగులు, తుమ్మెదలు ఇతర జంతువుల ఫొటోలు తీసుకున్నారు. అర్బన్ పార్కులో పర్యటించడంపై ఆనందాన్ని వ్యక్తం చేసినట్లు ఎఫ్ఆర్ఓ అరవింద్ వివరించారు. వారి వెంట సెక్షన్ ఆఫీసర్ సాయిరాం ఇతర సిబ్బంది ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



నాయకులతో జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్

కొల్చారం(నర్సాపూర్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నఘనాపూర్ శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల అత్యవసర సన్నాహక సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు హరీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ మేరకు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ప్రజలకు సూచించారు. అందుబాటులో ఉండే అభ్యర్థులను పోటీలో నిలిపి వారి గెలుపునకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్, నాయకులు దయాకర్ గౌడ్, యాదగిరి, దుర్గయ్య, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌హాల్ ఏర్పాట్లపై సూచనలు



లింగారెడ్డిపేట్‌లో నోబెల్ ఫార్మసీ కాలేజీని పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్/మనోహరాబాద్(తూప్రాన్): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే కౌంటింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ జయచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తూప్రాన్ డివిజన్ పరిధిలోని 6 మండలాలకు సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌ను మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట్ శివారులో ఉన్న నోబెల్ ఫార్మసీ కాలేజీలో కౌంటింగ్ హాల్ ప్రతిపాదించినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా సౌకర్యాలు, భద్రత తదితర అంశాలపై పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీఓ సతీష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల హాజరు అంతంతే..!



చిన్నశంకరంపేట: మిర్జాపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ పుష్పవేణి



ప్రార్థనలో 10 మంది విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో 421 మంది విద్యార్థులుండగా.. 8 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాల హాజరయ్యారు. అలాగే సూరారం జెడ్పీపాఠశాలలో 155 మంది విద్యార్థులకు ఒక్కరు కూడ హాజరుకాలేదు. అలాగే మిర్జాపల్లి ప్రాథమిక పాఠశాల, సంగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో 61 మంది విద్యార్థులకు ఒక్కరూ కూడ హాజరుకాలేదు. అదే విధంగా మండలంలోని 52 పాఠశాలలో 10 మంది లోపే హాజరయ్యారు. ఈ మేరకు చిన్నశంకరంపేట రైల్వేస్టేషన్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పుష్పవేణి తనిఖీ చేశారు.

శివ్వంపేట ఉన్నత పాఠశాలలో..

శివ్వంపేట(నర్సాపూర్): దసరా సెలవులు ముగిసిన అనంతరం శనివారం పాఠశాల పునఃప్రారంభమయ్యాయి. అయితే శివ్వంపేట ఉన్నత పాఠశాలలో 460 విద్యార్థులకు 15 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. అలాగే మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్‌కి సైతం విద్యార్థులు రాలేదు. కాగా, మండల వ్యాప్తంగా పీఎస్, యూపీఎస్, ఉన్నత పాఠశాలల్లో 4,523 మంది విద్యార్థులకు శనివారం 823 మంది మాత్రమే హాజరయ్యారు.

రోడ్డును పరిశీలించిన కలెక్టర్



రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని తిమ్మాయిపల్లి, హవేళిఘణాపూర్‌లలో వరదలతో కొట్టుకుపోయిన బ్రిడ్జిని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో కొట్టుకుపోయిన రోడ్ల వివరాలను తహసీల్దార్ సింధూరేణుకను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉన్న చోట తాత్కాలిక మరమ్మతులు చేసేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు.

అట్టహాసంగా 'అలయ్ బలయ్'



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దంతన్‌పల్లిలో స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి అలయ్ బలయ్ నిర్వహించారు. దసరా పండుగ పురస్కరించుకుని పద్మశాలి సంఘం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో అలయ్ బలయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రేమానురాగాలు పెరుగుతాయని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకాల జయరాములు అన్నారు.



పెద్దమ్మ ఆలయంలో హుండీ చోరీ



హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట పెద్దమ్మ ఆలయంలో శనివారం మధ్యాహ్నం హుండీ చోరీ జరిగింది. ఇటీవల పెద్దమ్మ ఆలయ ఉత్సవాలు నిర్వహించగా.. పెద్దమొత్తంలో నగదు, బంగారు ముక్కుపుడకలను భక్తులు హుండీలో వేశారు. అయితే శనివారం మధ్యాహ్నం హుండీని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి బంగారు కానుకలు, నగదును అపహరించారు. సాయంత్రం ఆలయం వద్దకు వెళ్లిన ఆలయ కమిటీ సభ్యులు చోరీ జరిగిందని తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు పెద్దమ్మ ఆలయం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు.

సమైక్యత స్ఫూర్తి దసరా పండగ

ఎంపీ సురేశ్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేశ్‌షెట్కార్

జహీరాబాద్ టౌన్: దసరా సమైక్యత స్ఫూర్తి పండగని జహీరాబాద్ ఎంపీ.సురేశ్ షెట్కార్ అన్నారు. లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సమ్మేళనం కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా సమ్మేళనానికి అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు హాజరుకావడం మనమంతా ఒక్కటేనన్నారు. పండగలు పరస్పర గౌరవం పెంచుతాయన్నారు. దసరా సమ్మేళనం కార్యక్రమం నిర్వహించిన సమాజ్ నాయకులను అభినందించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో ఎప్పటి నుంచో అలయ్ బలయ్ సంస్కృతి ఉందన్నారు. ఒకరినొకరు గౌరవిస్తూ పండగల్లో అందరూ పాల్గొని ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, తన్వీర్ సమాజ్, ,రాజశేఖర్ షెట్కార్, ఆర్.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య శిబిరానికి తరలివచ్చిన ప్రజలు

జహీరాబాద్: పట్టణంలోని మంకాల్ బ్యాంకెట్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆయా ఆస్పత్రుల ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా గ్యాస్ట్రోంటరాలజీ క్యాన్సర్ స్కానింగ్, టూడీ ఏకో, అల్ట్రా స్కానింగ్, రక్త పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. పరీక్షల అనంతరం రిపోర్టులను అందజేశారు. ఆయా రోగాలకు సంబంధించిన స్పెషలిస్టులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్, యువజన సంఘం నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

- ముగిసిన నవరాత్రి ఉత్సవాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు



తూప్రాన్‌లో అమ్మవారి నిమజ్జన శోభాయాత్రలో పూజలు చేస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ, ఎస్ఐలు

తూప్రాన్: మున్సిపల్ కేంద్రంలో మహంకాళి దేవాలయంలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో మహిళ నృత్యాలతో అమ్మవారి నిమజ్జన శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. దుర్గా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు. ఈ శోభాయాత్రలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ శివానందం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా అమ్మవారి నిమజ్జనం

పెద్ద శంకరంపేట (మెదక్): మండలంలో అమ్మవారి నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులు, మహిళలు కోలాటాలు ఆడుతూ అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.

హిందువాహిని ఆధ్వర్యంలో..

నర్సాపూర్: మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను శనివారం నిమజ్జనం చేశారు. హిందువాహిని ఆధ్వర్యంలో స్థానిక ధర్మశాలలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాతను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శనివారం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పట్టణంలో అమ్మవారి శోభాయాత్ర చేపట్టారు.

ఆలయాల్లో అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న, కొట్టాల, కంచన్‌పల్లి గ్రామాలలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులు అన్నదానం చేశారు. వెల్మకన్నలోని బాలవీరహనుమాన్ ఆలయంలో పురోహితుడు మెట్టురాములశర్మ ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించి చందన అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు.



నార్సింగిలో దుర్గామాత పూజలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారి అలంకరణతో కళాకారులు నిర్వహించిన కళాప్రదర్శన ఆకట్టుకుంది.

శివాజీయూత్ ఆధ్వర్యంలో..

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో శివాజీయూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా కోలాటలాడారు.



టేక్మాల్: బొడ్మట్‌పల్లిలో నృత్యం చేస్తున్న చిన్నారులు



కుకునూర్‌లో దుర్గామాత శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో భజనలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం దుర్గామాత విగ్రహ నిమజ్జన కార్యక్రమం కనులపండువగా సాగింది. పది రోజుల పాటు మంటపాల్లో పూజలందుకున్న అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ెరువుల్లో నిమజ్జనం చేశారు.

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

కె. లక్ష్మణ్
9502735264